క్లుప్తంగా

జూన్ 1న మార్కాపురంలో హనుమాన్ శోభాయాత్ర

మార్కాపురం: జూన్ 1వ తేదీన హనుమత్ జయంతి సందర్భంగా మార్కాపురం పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధి గోపాలుని హరిహరరావు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 26వ తేదీ ఆదివారం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఉదయం 10 గంటలకు కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శోభాయాత్ర 1వ తేదీ సాయంత్రం 5 గంటలకు తర్లుపాడు రోడ్డులోని పెద్దవాటర్ ట్యాంకు వద్దగల ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి సుమారు 1000 మంది భక్తులతో ర్యాలీ ప్రారంభమై కోర్టు సెంటరు, కంభం సెంటరు, పాత బస్టాండ్, దోర్నాల సెంటర్, నాయుడు బజారు మీదుగా చెన్నకేశవస్వామి గుడి వద్దకు చేరుతుందని వివరించారు. హనుమాన్ భక్తులందరూ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. 26న నిర్వహించనున్న సమావేశానికి భక్తులు హాజరై సలహాలు సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

వేసవి సెలవులను వినియోగించుకోవాలి



విజ్ఞాన శిబిరానికి హాజరైన విద్యార్థులు

బేస్తవారిపేట: గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు డ్యాన్స్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, చెస్, పెయింటింగ్, క్విజ్ పోటీలు, చదవడం, రాయడం, కథలు చెప్పడంపై తరగతులు నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ విద్యార్థులను వేసవి శిక్షణ తరగతులకు పంపించాలని కోరారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



తువ్వపాడులో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

కొనకనమిట్ల: ఎన్నికల కౌంటింగ్ రోజున గ్రామాల్లో అల్లర్లు సృష్టించి లా అండ్ ఆర్డర్‌కు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పొదిలి సీఐ మల్లికార్జునరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్థానిక ఎస్సై మాధవరావు, పోలీస్ సిబ్బందితో మండలంలోని తువ్వపాడు, నాగంపల్లి, గొట్లగట్టు గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రజలతో సమావేశాలు నిర్వహించి శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా సమన్వయం పాటించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో గ్రామాల్లో అందరూ కలిసిమెలిసి ఉండాలని కోరారు. ఎన్నికల కౌంటింగ్ రోజున రెచ్చగొట్టే మాటలు మాట్లాడుకొని, గొడవలు పడి పోలీస్‌స్టేషన్లకు వచ్చి ఇబ్బంది పడవద్దని ప్రజలకు సూచించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసులను సంప్రదించాలని చెప్పారు.

5 వాహనాలు సీజ్

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలంలోని పెద్దనాగులవరం, రాయవరం గ్రామాల్లో శుక్రవారం ఉదయం నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 5 వాహనాలను సీజ్ చేసినట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు. ఏఎస్‌ఐ శ్రీనివాసరావు, పట్టణ ఎస్సై మునాఫ్‌తో పాటు సుమారు 25 మంది పోలీసు సిబ్బందితో గ్రామంలో ఇంటింటినీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కౌంటింగ్ అనంతరం ఎవరైనా గొడవలు చేస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రశాంతంగా కుటుంబ సభ్యులతో గడపాలని, కేసులు నమోదైతే కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరించారు.

గ్రామోత్సవంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి



ప్రత్యేక అలంకరణతో వాహనంలో ఊరేగుతున్న స్వామి మూర్తులు



అగ్గి సేవ నిర్వహిస్తున్న భక్తులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొండ మీద శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని అమ్మవార్లతో సహా ప్రత్యేక పల్లకిలో కొండమీద లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి పొట్టి శ్రీరాములు వీధి, అమ్మవారిశాల, కుమ్మరాంకట్ట సెంటర్ మీదుగా అభయాంజనేయస్వామి ఆలయం వరకు అగ్గి సేవతో ఊరేగింపుగా స్వామి వారిని తీసుకెళ్లారు. ఆలయంలోని మూలవిరాట్ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని గిరిజానాథస్వామి ఆలయంలో, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకురాలు వెంకటనరసమ్మ ఆధ్వర్యంలో స్వామి వారి గ్రామోత్సవం ముందు అగ్గి సేవను నిర్వహించారు. పెంచలయ్య ఆర్థిక సహాయం మేరకు భక్తులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. గురువారం రాత్రి గిద్దలూరు నియోజకవర్గం దేవాలయ కమిటీ అధ్యక్షుడు చేరెడ్డి యర్రారెడ్డి ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన నృత్య కళాకారుల చేత భరతనాట్యం నృత్య ప్రదర్శన నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ధ్వంసమైన లారీని పరిశీలిస్తున్న సీఐ

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట సమీపంలోని నల్లమల ఘాట్‌లో లారీ..బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానిక సీఐ వైవీ సోమయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బేతంచర్ల మండలం కొట్టాల గ్రామానికి చెందిన ఎండూరి మద్దిలేటి తన లారీని కర్ణాటక నుంచి కంభానికి పంచదార లోడు వేసుకుని వస్తున్న సమయంలో నల్లమల ఘాట్‌లోని ఇటుకల బ్రిడ్జి మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టి రోడ్డు మార్జిన్‌దాటి బ్రిడ్జిని కూడా ఢీకొట్టింది. ప్రమాదంలో అద్దంకి నుంచి అనంతపురానికి బైక్‌పై వెళ్తున్న తమ్మిశెట్టి అనిల్‌కుమార్, ఉప్పుతల రామకృష్ణతో పాటు లారీ నడుపుతున్న డ్రైవర్ మద్దిలేటికి గాయాలయ్యాయి. అనంతరం సమాచారం అందుకున్న సీఐ తన సిబ్బందితో సహా సంఘటన స్థలం వద్దకు చేరుకుని 108 సిబ్బంది సాయంతో వారిని చికిత్స కోసం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

నేటి నుంచి శ్రీరామ నామ సప్తాహ మహోత్సవాలు

కొనకనమిట్ల:

మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రంలో శనివారం నుంచి ద్వాదశ 12వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు తెలిపారు. శనివారం శ్రీలక్ష్మీ నారాయణస్వామి కళ్యాణం, 26న శ్రీలక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం, 27న శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి కళ్యాణం, 28న శ్రీరుక్మిణి, సత్యభామ సహిత వేణుగోపాలస్వామి కళ్యాణం, 29న శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వరస్వామి కళ్యాణం, 30న శ్రీసీతారాముల కళ్యాణం, 31న సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలతోపాటు జూన్ 1న శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజ, సర్వదేవతా దర్శనం కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. భక్తులకు నిత్యం అన్న సంతర్పణ చేస్తున్నట్లు కమిటీ సభ్యుడు యక్కంటి తిరుపతిరెడ్డి తెలిపారు.

ఉదయం ఎండ..సాయంత్రం వర్షం



కొమరోలులో కురిసిన వర్షం

కొమరోలు: రోజురోజుకూ వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకే రోజులో సూర్యుడు ఉగ్రరూపం చూపిస్తుండగా మరోవైపు ఆకాశం మేఘావృతమై వర్షం పడుతోంది. ఈ విచిత్రపు వాతావరణంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సూర్యుడు ఉగ్రరూపం చూపించగా 3 గంటల తర్వాత నుంచి ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఉదయం ఎండ వేడిమికి అల్లాడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షానికి సేదతీరారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కొమరోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలను ఎస్సై మధుసూదన్ రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, బయటి వ్యక్తులు ఎవరూ పరీక్ష కేంద్రాల వద్ద సంచరించవద్దని తెలిపారు.

శుక్రవారం సంస్కృతం, తెలుగు పరీక్షలు జరిగాయి.